
బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాసంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు ఉమ, అరుణ, వసంత, మున్సిపల్ మాజీ చైర్స్‌పర్సన్ మాధవితో ఎమ్మెల్సీ కవిత

## ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

వేములవాడ, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కల్వ కుంట్ల కవిత బుధవారం వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ నియోజకర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాసంలో ఎమ్మెల్సీని పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు ఉమ, అరుణ, వసంత, మున్సిపల్ మాజీ చైర్స్‌పర్సన్ మాధవి, తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్సీ కవితకు గాజులు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ

## ఆడబిడ్డకు గాజుల సంబురం..

వేములవాడ, ఫిబ్రవరి 26 : రాజన్నను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దర్శించుకున్నారు. అనంతరం ఆమె జాతరలో గాజుల దుకాణానికి వెళ్లగా, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గాజులు కొనుగోలు చేసి, అందజేశారు. దుకాణంలో ఉన్న మహిళలను ఎమ్మెల్సీ కవిత ఆప్యాయంగా పలకరించారు. వారు సెల్ఫీలు దిగారు.



జిల్లా కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సన్నద్ధం

- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పర్యవేక్షించిన కలెక్టర్
- అధికారులు, సిబ్బందికి విధులపై దిశానిర్దేశం


ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బుధవారం ఎన్నికల సామగ్రితో సిబ్బంది పో లింగ్ కేంద్రాలకు బయలుదేరింది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబందించి ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల మైదానంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను పర్యవేక్షించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులు, సిబ్బందికి విధులపై దిశానిర్దేశం చేశారు. సామగ్రితో ఎన్నికల సిబ్బంది ప్రత్యేక బస్సులలో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. జిల్లాలో మొత్తం 23,347మంది ఓటర్లు ఉండగా, అందులో 22397మంది గ్రాడ్యుయేట్లు, 950 మంది టీచర్లు ఉన్నారు. కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టభద్రుల స్థానాలకు 56, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు 15మంది బరిలో ఉన్నారు. ఇందు కోసం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతోపాటు చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 28, టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 13 ఏర్పాటు చేశారు. పోలింగ్ కోసం ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, పీవోలు, ఏపీవోలతో 185మంది సిబ్బందిని కేటాయించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆర్డీవోలు రాధాబాయి, రాజేశ్వర్ పర్యవేక్షించారు.

### ఓటుహక్కు వినియోగించుకోవాలి: కలెక్టర్

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఓటు వేసేందుకు వెళ్లే క్రమంలో ఓటర్లు సంబంధిత పత్రాలు తమవెంట తీసుకెళ్లాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించుకునే వారికి వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర, వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న గ్రాడ్యుయేట్లు, టీచర్లకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు.

### పటిష్ట బందోబస్తు: ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికలకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా 41 పోలింగ్ కేంద్రాల్లో 200మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద ఎక్కువ మంది ఉండవద్దని, పార్టీ జెండాలు, గుర్తులు, కార్డులు ధరించవద్దని, మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదని సూచించారు. ధర్నాలు, ఊరేగింపులు, పటాకులు కాల్చడం నిషేధమన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

## శివ.. శివా ఇదేం దుస్థితి?

- ఎములాడలో భక్తులకు ఇక్కట్లు
- శివరాత్రి ఏర్పాట్లలో అధికారులు విఫలం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 26: వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులు ఇబ్బందులు పడ్డారు. జాతర ఏర్పాట్లలో అధికారులు విఫలం కావడంతో నరకం చూశారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి దాదాపు 2.50లక్షల మంది తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానం చేసి, స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ప్రధానంగా కోడెమొక్కు తీర్చుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. గంటలతరబడి వేచి ఉన్నారు. అయితే రద్దీకి తగ్గట్లు అధికారులు వసతులు కల్పించలేదని, కేవలం వీఐపీల సేవలోనే తరించారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


క్యూలైన్లో భక్తుల బారులు


పెద్దలింగాపూర్‌లో ఎండిన వరి చేనులో మేస్తున్న గొర్రెలు

## నీళ్లులేక.. జీవాలకు మేతగా..

- పెద్దలింగాపూర్‌లో ఎండిన వరి చేను
- గొర్రెలను మేతకు విడిచిపెట్టిన రైతు
- సర్కారు ఆదుకోవాలని వేడుకోలు

ఇల్లంతకుంట రూరల్, ఫిబ్రవరి 26: సాగునీరందక పొట్ట దశకు వచ్చిన వరి పంటకు ఎండిపోవడంతో.. ఆ రైతు గొర్రెలకు విడిచిపెట్టాడు. అప్పుచేసి మరీ పంటలు సాగు చేస్తే.. చివరికి తమకు అప్పులే మిగిలాయంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కముటం రవి అనే రైతు తనకున్న ఎకరంన్నర వ్యవసాయభూమిలో యాసంగి పంటగా వరి సాగు చేశాడు. తీరా వరి పొట్టదశకు వచ్చే సమయానికి వ్యవసాయ బావిలో సాగునీళ్లు అడుగంటిపోవడంతో వరి పైరు ఎండిపోయింది. దీంతో చేసేదేమీ లేక ఎండిన పొలంలో గొర్రెలను మేపుతున్నారు. ఎకరంన్నర పొలం ఎండడంతో రూ.40 పెట్టుబడి మీదపడిందని బాధిత రైతు ఆవేదన చెందాడు. కాల్వల నిర్మాణం పూర్తి చేసి.. రంగనాయకసాగర్ నుంచి తమ గ్రామంలోని చెరువులకు సాగునీరందించి ఉంటే వరి చేను ఎండిపోయేది కాదని, ప్రభుత్వం తమకు పంట నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

### దుబ్బ రాజన్నజాతరలో భక్తుల నిలువు దోపిడీ

సారంగాపూర్, ఫిబ్రవరి 26: పెబంట్లలోని దుబ్బ రాజన్న క్షేత్రంలో జాతర ఉత్సవాల్లో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆలయం ఎదుట, కోనేరు వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో కొబ్బరికాయలు, బెల్లం అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయ రూ. 50, బెల్లం కిలో రూ. 100కు విక్రయించారు. విషయం తెలుసుకున్న ఆలయ మాజీ ధర్మకర్తలు కోండ్ర రాంచందర్ రెడ్డి, వాసం శ్రీనివాస్, కొలపాక రవి, చిందం శ్రీనివాస్, పిట్టల చిన్నగంగారాం కొబ్బకాయల దుకాణానికి వెళ్లి అధిక ధరకు ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించారు.? ఈవోకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా ఆలయ అధికారులు ఎవరూ రాలేదు.

### 'విజయవంతం చేయాలి'

ధర్మారం, ఫిబ్రవరి 26: బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన 'పల్లెబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ ఆయన స్వగృహంలో పల్లెబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, గ్రామ గ్రామాన బీసీల చైతన్యం, ఐక్యత కోసం పల్లెబాట నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. జనాభాలో బీసీల వాటాపై జరుగుతున్న పల్లెబాట కార్యక్రమం బీసీలను కదిలించడానికి ఎంతో ఉపయోగపడుతుందని, బీసీలు, ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## ఎల్లమ్మ వాగులోకి మల్లన్నసాగర్ జలాలు

- ఎట్టకేలకు స్పందించిన సర్కారు
- పంటలకు సాగునీరు విడుదల
- 'నమస్తే' కథనాలకు స్పందన


పెద్ద చెరువు నుంచి ఎల్లమ్మ వాగులోకి వస్తున్న సాగునీరు

ముస్తాబాద్, ఫిబ్రవరి 26: 'ఎండలు మండుతున్నాయి.. పంటలు ఎండుతున్నాయి'.. ఎల్లమ్మ వాగులోకి నీటిని విడుదల చేయాలంటూ.. నమస్తే తెలంగాణలో వచ్చిన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. ఎట్టకేలకు మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా ఎల్లమ్మ వాగులోకి సాగునీటిని విడుదల చేశారు. నక్కవాగు పరిసర గ్రామాలైన పోతుగల్, గన్నెవానిపల్లె, నర్సింహులతండా, మామిండ్లవారిపల్లె, నిమ్మలవారిపల్లె, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామాల్లో రైతులు వేసిన వరి పంట నీరు లేక వాడిపోతుందని వెంటనే నీరందించాలని వారం క్రితం అధికారులకు విన్నవించారు. ధర్నాలు, ఆందోళనలు సైతం చేశారు. దీంతో ప్రభుత్వం స్పందించి ముస్తాబాద్ పెద్ద చెరువు నుంచి మల్లన్నసాగర్ నీటిని ఎల్లమ్మ వాగులోకి విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.


పెద్ద చెరువు నుంచి ఎల్లమ్మ వాగులోకి నీరు వదలి పంటలను కాపాడాలని మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

## పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 26: పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం కొత్తూరు మల్లయ్య అధ్యక్షతన బుధవారం పట్టణంలోని సీఐటీయూ హమాలీ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించకుంటే దశలవారీగా పోరాటాలకు సన్నద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో రెండు నుంచి ఐదు నెలల వరకు పంచాయతీ కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రావు, ఎలుకపెల్లి సారయ్య, మహంకాళి కొమురయ్య, కాశిపాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, మొలుగూరి ప్రేమ్ కుమార్, గంధసిరి సంపత్, సమ్మయ్య, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

### తాటిచెట్టు నుంచి పడి గీతకార్మికుడి దుర్మరణం

గన్నేరువరం, ఫిబ్రవరి 26: జంగపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు ముత్యం ధర్మయ్య గౌడ్ (59) ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి పడడంతో మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ధర్మయ్య గౌడ్ జంగపల్లి, పీచుపల్లి గ్రామాల మధ్య గల కొత్త తాటిచెట్ల వద్దకు వెళ్లాడు. ఒక తాడిచెట్టు ఎక్కి చుట్టూ పూర్తి చేసి అనంతరం మరొక చెట్టు పైకి ఎక్కి సగం వరకు వెళ్లి చుట్టుపడుతుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఇసుక వాహనాల పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 26: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక శ్రీధర్ ట్రాక్టర్‌లో, నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సుద్దాల దేవుడు ట్రాలీలో మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా కనపర్తి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న కొలిపాక శ్రీధర్, సుద్దాల దేవుడుపై కేసు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అక్రమ రవాణాకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పాఠశాలలో సరస్వతీ విగ్రహం ఏర్పాటు



విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు

చందుర్తి, ఫిబ్రవరి 26 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం సరస్వతి విగ్రహ ప్రతిష్ట చేశారు. 1992-1993 పదో తరగతి పూర్వ విద్యార్థులు విగ్రహ ప్రతిష్ఠకు సహకరించగా, గతంలో పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసిన చందనగిరి దేవయ్య కుమారుడు చందనగిరి హరికృష్ణ పాఠశాలపై మమకారంతో సరస్వతిదేవీ విగ్రహ ఏర్పాటుకు కృషి చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, పాఠశాలపై మమకారంతో విగ్రహ ఏర్పాటుకు సహకరించిన పూర్వ విద్యార్థులు, స్నేహితులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, రాచర్ల రాము, చీర్రం తిరుపతి, చిలుక భూమేశ్, రవీందర్ రెడ్డి, తిరుపతి రావు, పూర్వ విద్యార్థులు గ్రామస్తులు ఉన్నారు.

### క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ

ఇల్లంతకుంట రూరల్, ఫిబ్రవరి 26 : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కేతిరెడ్డి నవీన్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన క్రీడాకారులకు రూ.45 వేల విలువ గల మూడు క్రికెట్ కిట్లు, జెర్సీలు బుధవారం పంపిణీ చేశారు. యువకులు క్రీడల్లో రాణించి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


వేములవాడ టౌన్: స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


స్వామివారి దర్శనం కోసం నిలబడ్డ శివదీక్షాపరులు


ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


ఎల్లారెడ్డిపేట : కల్యాణం జరిపిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు దంపతులు

# శంభోశంకర..

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 26: హరహర మహదేవ.. శంభోశంకర.. అంటూ సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయం బుధవారం శివ నామస్మరణతో మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దాదాపు 2.50లక్షల మంది భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసోయింది. స్వామివారికి కోడె మొక్కు తీర్చుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూ లో బారులుతీరారు. ఉదయం 7గంటలకు కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్వామివారికి ప ట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం 6గంటలకు రాజన్న ఆలయ అద్దాల మం డపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు దాదా పు 2వేలమంది శివభక్తులు 41రోజుల కఠోర దీక్షతో శివదీక్ష తీసుకుని స్వామివారిని ద ర్శించుకున్నా రు. రాత్రి 11.30గంటలకు లింగోద్భవకాలంలో స్థానాచార్యుడు నమిలకొండ ఉమే శ్ ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కనులపండువగా నిర్వహించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.


రాజన్న ఆలయ పరిసర ప్రాంతంలో భక్తజనం

### అక్రమ నిర్మాణంపై సీరియస్


జాలిని తొలగించిన పంచాయతీ సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26 : మండలకేంద్రంలోని కామారెడ్డి-కరీంనగర్ ప్రధాన రహదారిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రహరీని ఆనుకొని నిర్మించిన ఓ షెడ్డుపై పంచాయతీ అధికారులు సీరియస్‌గా పరిగణించి తొలగించారు. ఓ వ్యక్తి సబ్‌స్టేషన్ ప్రహరీని ఆనుకుని షెడ్డును నిర్మించుకునే ప్రయత్నం సోషల్ మీడియాలో బుధవారం వైరల్ కాగా, సమాచారం తెలుసుకున్న పంచాయతీ అధికారులు షెడ్డుకు సంబంధించిన జాలి, బేస్‌ను తొలగించారు.

### పిచ్చికుక్కల దాడి.. ఐదు గురికి గాయాలు

చందుర్తి, ఫిబ్రవరి 26 : మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పిచ్చికుక్కల బెడద ఎక్కువవుతోంది. పిచ్చికుక్క స్వైర విహారంతో ఐదుగురిపై దాడి చేసిన సంఘటన బుధవారం మండలకేంద్రంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పవన్ సాయి, రోషన్, దీక్షిత అనే చిన్నారులతో పాటు అమృత, సత్తయ్యపై దాడి చేసి గాయపరిచాయి. బాధితులను చికిత్స కోసం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నాయి.